పోటీ పరీక్షల్లో అక్రమాల కట్టడి

బిల్లుకు లోక్‌సభ ఆమోదం

విపక్షాల సవరణలు తిరస్కరణ

న్యూఢిల్లీ: పోటీ పరీక్షల్లో అక్రమాలను అడ్డుకునేందుకు రూపొందించిన బిల్లుకు మంగళవారం లోక్‌సభ ఆమోదం తెలిపింది. కేంద్ర ప్రభుత్వ సంస్థలు నిర్వహించే పోటీ పరీక్షల్లో అక్రమాలను అరికట్టేందుకు రూపొందించిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) బిల్లు - 2024ను మంగళవారం లోక్‌సభలో ఆమోదించింది. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ దీన్ని సభలో ప్రవేశ పెట్టిన సంగతి తెలిసిందే. మెరిట్ విద్యార్థులు, అభ్యర్థుల ప్రయోజనాలను రక్షించేందుకు ఉద్దేశించిన బిల్లుగా దీన్ని అభివర్ణించారు. అయితే ఈ బిల్లుకు సంబంధించి విపక్షాలు కొన్ని అభ్యంతరాలు లేవనెత్తాయి. మరికొన్ని సవరణలు సూచించాయి. అవన్నీ కూడా తిరస్కరణకు గురయ్యాయి. ఆ తర్వాత లోక్‌సభ ఈ బిల్లును ఆమోదించింది. ఈ చట్టం అమల్లోకి వస్తే అక్రమార్కులకు మూడినట్టే. పేపర్ లీకేజీకి పాల్పడినా, మాల్ ప్రాక్టీస్ చేసినా, నకిలీ వెబ్‌సైట్లు తెరిచినా గరిష్ఠంగా పదేళ్ల జైలు, కోటి రూపాయల దాకా జరిమానా విధిస్తారు. యూపీఎస్సీ, ఎస్ఎస్‌సీ, ఆర్ఆర్‌బీ, ఐబీపీఎస్, ఎన్‌డీఏ లాంటి పోటీ పరీక్షలతో పాటు నీట్, జేఈఈ, సీయూఈటీ వంటి ఎంట్రన్స్ టెస్టులకు కూడా ఈ చట్టం వర్తిస్తుంది.

పార్లమెంట్ సమావేశాలు 10 వరకు పొడిగింపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలను కేంద్ర ప్రభుత్వం ఈ నెల 10 వరకు పొడిగించింది. జనవరి 31న ప్రారంభమైన సమావేశాలు వాస్తవానికి ఈ నెల 8తో ముగియాల్సి ఉన్నది. అయితే సమావేశాలను మరో రెండు రోజులపాటు పొడిగిస్తున్నట్టు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి మంగళవారం తెలిపారు. 2014కి ముందు, ఆ తర్వాత భారత ఆర్థిక వ్యవస్థ స్థితిగతులను పోల్చి శ్వేత పత్రం విడుదల చేస్తామని బడ్జెట్ ప్రసంగంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన విషయం తెలిసిందే.

ఐదేండ్లలో 701 దేశ ద్రోహం కేసులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: 2018-22 మధ్య కాలంలో దేశంలో 701 దేశ ద్రోహం, 5,023 చట్ట వ్యతిరేక కార్యకలాపాలు(నిరోధం) చట్టం(ఉపా) కేసులు నమోదయ్యాయి. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ మంగళవారం లోక్‌సభలో ఒక ప్రశ్నకు సమాధానంగా ఈ వివరాలు వెల్లడించారు. 2021లో 149 దేశ ద్రోహం కేసులు నమోదు కాగా 2022లో 68 నమోదయ్యాయని తెలిపారు. ఈ కేసుల్లో 788 మందిని అరెస్ట్ చేసి 500 మందిపై చార్జ్‌షీట్ దాఖలు చేశారు. 131 మందిని నిర్దోషులుగా విడిచిపెట్టారు.

'భారత్ రైస్' అమ్మకాలు షురూ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: 'భారత్ రైస్' బ్రాండ్ పేరుతో బియ్యం అమ్మకాల్ని కేంద్ర ప్రభుత్వం మంగళవారం ప్రారంభించింది. సబ్సిడీ రేటులో కిలో రూ.29 ధరకు 5 కిలోలు, 10 కిలోల బియ్యం బ్యాగుల్ని మార్కెట్లోకి విడుదల చేసింది. బియ్యం బ్యాగుల్ని వినియోగదారులకు చేర్చే.. 100 మొబైల్ వ్యాన్లకు న్యూఢిల్లీలో కేంద్ర ఆహార మంత్రి పీయూష్ గోయల్ జెండా ఊపి ప్రారంభించారు. ప్రతి బ్యాగ్‌లో 5 శాతం వరకు నూకలు

ఉంటాయని చెప్పారు. కేంద్రం ఇప్పటికే భారత్ దాల్, భారత్ ఆటా.. పేరుతో శెనగ పప్పు, గోధుమ పిండి అమ్మకాలను ప్రారంభించింది.

కర్ణాటక సర్కార్‌పై రైతుల కన్నెర్ర

కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బెంగళూరులో అన్నదాతల ఆందోళన

వేలాది మంది రైతుల హాజరు • రైతులకు రుణమాఫీ చేయాలి

బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి నిధులు పెంచాలని డిమాండ్

బెంగళూరు, ఫిబ్రవరి 6: కర్ణాటక కాంగ్రెస్ సర్కార్‌పై రైతులు కన్నెర్ర చేశారు. అన్నదాతలకు రుణాల మాఫీ చేయాలని, త్వరలో ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి అధిక నిధులు కేటాయించడంతోపాటు రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వేలాది మంది రైతులు మంగళవారం 'బెంగళూరు చలో' కార్యక్రమం చేపట్టారు. రాష్ట్రంలోని సిద్ధరామయ్య ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపట్టిన ఈ ఆందోళన కార్యక్రమంలో భాగంగా దాదాపు 5 వేల మంది రైతులు బెంగళూరులోని ఫ్రీడమ్ పార్క్‌కు చేరుకొన్నారు. రాష్ట్ర చెరకు రైతుల సంఘం అధ్యక్షుడు కురుబురు శాంతకుమార్ ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ సిద్ధరామయ్య ప్రభుత్వం గత బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రూ.13 వేల కోట్ల మేర కేటాయింపులు కోత విధించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న బడ్జెట్‌లోవ్యవసాయానికి అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

కరువుతో వలసపోతున్న రైతులు..

పంట నష్టాలతో రుణ ఊబిలో చిక్కుకుపోయిన రైతులకు రుణమాఫీ చేయాలని శాంతకుమార్ కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు సీఎం సిద్ధరామయ్య రానున్న బడ్జెట్‌లో పరిష్కారం చూపాలన్నారు. అన్నదాతలు తీవ్రమైన కరువు పరిస్థితులు ఎదుర్కొంటున్నారని, ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోతున్న దుస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. చాలా మంది రైతులు అప్పుల బాధతో ఆత్మహత్యలు చేసుకొంటున్నారని పేర్కొన్నారు. వ్యవసాయదారులను పెండ్లి చేసుకొనే మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని రైతు సంఘాలు డిమాండ్ చేశాయి. పరిశ్రమల కోసం వ్యవసాయ భూముల సేకరణను ఆపాలని, ఒక వేళ తన భూమిని ఇచ్చిన రైతును వాటాదారుగా చేర్చాలని, తమిళనాడుకు నీటిని విడుదల చేయడం ద్వారా నష్టపోయిన కావేరీ బేసిన్ రైతులకు రూ.25 వేల చొప్పున పరిహారం అందించాలని రైతులు డిమాండ్ చేశారు.

ఉరికొయ్యకు అన్నదాత

కర్ణాటకలో కరువు, పంట నష్టాలు, అప్పుల బాధతో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. వందలాది మంది అన్నదాతలు గత్యంతరం లేక ఆత్మహత్యలు చేసుకొంటున్నారు.

601 రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గత ఏడు నెలల్లో ఆత్మహత్యకు పాల్పడిన అన్నదాతల సంఖ్య

3 సగటున రోజుకు ఆత్మహత్యకు పాల్పడుతున్న రైతుల సంఖ్య

223 రాష్ట్రంలోని 236 తాలూకాలకు గానూ 223 తాలూకాలను ప్రభుత్వం కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించింది.

మూడు జిల్లాల్లోనే **1/3** వంతు ఆత్మహత్యలు

హావేరీ **62**

బెళగావి **56**

చిక్కమగళూరు **49**

అజిత్ చేతికే గడియారం

ఆయనదే అసలైన ఎన్సీపీ

కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడి

న్యూఢిల్లీ/ముంబై, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికలకు ముందు ఎన్సీపీ వ్యవస్థాపకుడు శరద్ పవార్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అజిత్ పవార్ వర్గమే అసలైన నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) అని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఆ పార్టీ ఎన్నికల గుర్తు 'గడియారం'ను కూడా అజిత్ వర్గానికే కేటాయిస్తూ ఈసీ మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. దీంతో గత కొన్ని నెలలుగా అసలైన ఎన్సీపీ ఎవరిదనే విషయంలో శరద్ పవార్, అజిత్ పవార్ వర్గాల మధ్య కొనసాగుతున్న కుమ్ములాటలకు ఎన్నికల సంఘం తెరదించినట్టు అయింది. తనదే అసలైన ఎన్సీపీ అంటూ అజిత పవార్ దాఖలుచేసిన పిటిషన్‌పై గత ఆరు నెలల్లో 10 సార్లు విచారణ జరిపిన ఈసీ ఈ మేరకు తన తాజా నిర్ణయాన్ని ప్రకటించింది. ఎన్నికల కమిషనర్‌గా అనూప్



శరద్ పవార్

చంద్ర పాండే కొద్ది రోజుల్లో పదవీ విరమణ పొందనున్న నేపథ్యంలో తాజా నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకొన్నది.

కొత్త పార్టీ పేరు, ఎన్నికల గుర్తు ఎంచుకోండి..

అజత్ పవార్ వర్గమే అసలైన ఎన్సీపీ అని ప్రకటించిన ఈసీ.. ఈ నెలాఖరులో జరుగనున్న రాజ్యసభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని శరద్ పవార్‌కు ప్రత్యామ్నాయ అవకాశం కల్పించింది. తన వర్గానికి పార్టీ పేరు, ఎన్నికల గుర్తును ఎంచుకొనేందుకు అవకాశం ఇచ్చింది. ఈ మేరకు బుధవారం సాయంత్రం 3 గంటలలోగా మూడు ప్రతిపాదనలు పంపాలని సూచించింది.

గత జూలైలో అజిత్ వేరుకుంపటి

గత ఏడాది జూలైలో ఎన్సీపీలోని మెజార్టీ ఎమ్మెల్యేలతో అజిత్ పవార్ వేరు కుంపటి పట్టిన విషయం తెలిసిందే. బీజేపీ-శివసేన(షిండే) ప్రభుత్వంలో చేరిన ఆయన డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టారు. ఆయనతో పాటు ఎనిమిది మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని శరద్ పవార్ వర్గం ఫిర్యాదు చేసింది. అయితే అధిక ఎమ్మెల్యేల సంఖ్యా బలం కలిగిన తమ వర్గానిదే అసలైన ఎన్సీపీ అని అజిత్ పవార్ క్లెయిమ్ చేశారు. ఎన్సీపీ చీలికలను గుర్తించిన ఎన్నికల సంఘం ఇరువర్గాలను తగిన పత్రాలు సమర్పించాలని ఆదేశించింది.

'పై నుంచి ఒత్తిళ్ల'తో ఈ నిర్ణయం

ఈసీ నిర్ణయాన్ని శరద్ పవార్ వర్గం తీవ్రంగా వ్యతిరేకించింది. ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని, దురదృష్టకరమని మాజీ మంత్రి అనిల్ దేశ్‌ముఖ్ అన్నారు. 'పై నుంచి ఒత్తిళ్ల'తో ఎన్నికల సంఘం ఈ ఉత్తర్వులు జారీచేసిందని ఆరోపించారు. ఈసీ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ 48 గంటల్లో సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని పార్టీ నేత సుప్రియా సూలే పేర్కొన్నారు.

అజిత్ పవార్

స్వాగతిస్తున్నాం: అజిత్

ఎన్సీపీ పార్టీ పేరు, ఎన్నికల గుర్తును తమ వర్గానికి కేటాయిస్తూ ఈసీ తీసుకొన్న నిర్ణయాన్ని వినయంతో స్వాగతిస్తున్నానని అజిత్ పవార్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. పార్టీ ఎమ్మెల్యేలు, కార్యకర్తల్లో మెజార్టీ అజిత్ పవార్ వైపు ఉన్నారనే విషయాన్ని ఈసీ తీర్పు నిరూపించిందని ఎన్సీపీ నేత ప్రఫుల్ పటేల్ అన్నారు.

అమెరికాలో హైదరాబాద్ యువకుడిపై దాడి

దోపిడీకి పాల్పడ్డ దుండగులు

హైదరాబాద్: హైదరాబాద్‌కు చెందిన ఒక యువకుడు అమెరికాలోని షికాగోలో దారి దోపిడీకి గురవడంతో పాటు దొంగల చేతిలో తీవ్రంగా గాయపడ్డాడు. సయ్యద్ మజహిర్ అలీ ఇండియన్ వెస్లియన్ యూనివర్సిటీలో ఐటీలో మాస్టర్స్ చేస్తున్నాడు. అతడి భార్య ఫాతిమా రిజ్వీ వివరాల ప్రకారం.. ఈ నెల 4న తన అపార్టుమెంట్ సమీపంలో సయ్యద్‌ను కొందరు అడ్డగించి దోపిడీకి పాల్పడ్డారు. వెంటనే అతడిని స్థానిక దవాఖానలో చేర్చారు. అతని మిత్రుడు ఫోన్ ద్వారా భారత్‌లోని ఫాతిమాకు సమాచారం అందించాడు. తీవ్రంగా గాయపడిన తన భర్తకు ఫోన్ చేశానని, ఆయన కనీసం మాట్లాడలేని స్థితిలో ఉన్నాడని, ఆయనకి తగిన వైద్య సహాయం అందించాలని ఆమె మంగళవారం విదేశాంగ మంత్రి జైశంకర్‌కు విజ్ఞప్తి చేసింది.

మంచిపని చేసే వ్యక్తులకు గౌరవం దక్కదు!

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

ముంబై: ఈ రోజుల్లో సిద్ధాంతాలకు కట్టుబడి ఉండే నాయకులు తక్కువ సంఖ్యలో ఉన్నారని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి అభిప్రాయపడ్డారు. అవకాశవాదులే ఎక్కువగా ఉన్నారని ఆయన ఆరోపించారు. అధికార పార్టీతో అంటకాగాలని చూసే వారే అధికమని అన్నారు. సిద్ధాంతాల భూమిక లేకపోవడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని చెప్పారు. మంగళవారం ముంబైలో లోక్‌మత్ మీడియా గ్రూప్ ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో నితిన్ గడ్కరీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏ పార్టీ ప్రభుత్వమైనా సరే.. మంచి పనిచేసేవాడికి గౌరవం లభించదని, చెడ్డ పనిచేసే వారికి శిక్ష పడదని తానెప్పుడూ సరదాగా చెప్పేవాడినని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేస్తూ.. ఎవరిని ఉద్దేశించి ఇలా అన్నారో ఆ పేరు మాత్రం వెల్లడించలేదు.

కర్ణాటక సీఎంకు 10 వేల జరిమానా

బెంగళూరు: నిరసన పేరుతో రోడ్లను దిగ్బంధం చేసి, వాహనదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారన్న 2022నాటి కేసులో సీఎం సిద్ధరామయ్యకు కర్ణాటక హైకోర్టులో చుక్కెదురైంది. తనపై దాఖలైన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలన్న ఆయన పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించింది. ఆయనతో సహా మంత్రులు ఎంబీ పాటిల్, రామలింగా రెడ్డి, కర్ణాటక కాంగ్రెస్ ఇంచార్జ్ రణదీప్ సింగ్ సూర్జేవాలాకు రూ.10 వేలు జరిమానా విధించింది. మార్చి 6న ఎంపీ, ఎమ్మెల్యే ప్రత్యేక కోర్టు ముందు ప్రత్యక్షంగా హాజరుకావాలని సీఎం సిద్ధరామయ్యకు కోర్టు ఆదేశాలు జారీచేసింది. గత బీజేపీ సర్కార్ పాలనలో కాంట్రాక్టర్ సంతోశ్ పాటిల్ ఆత్మహత్య సందర్భంగా కాంగ్రెస్ నాయకులు నిరసన ర్యాలీని చేపట్టడంపై కేసు నమోదైంది.

మయన్మార్ సరిహద్దు అంతటా కంచె వేస్తాం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: భారత్-మయన్మార్ మధ్య ఉన్న 1,643 కిలోమీటర్ల సరిహద్దులో కంచె ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా మంగళవారం వెల్లడించారు. ఇప్పటివరకు ఇరు దేశాల సరిహద్దులోని ప్రజలు 16 కిలోమీటర్ల పరిధి వరకు ఎలాంటి దస్త్రాలు లేకుండా అటు ఇటు స్వేచ్ఛగా సంచరించే అవకాశం ఉంది. కంచె నిర్మాణం ద్వారా ఈ సంచారానికి అడ్డుకట్ట పడనుంది. సరిహద్దుల ద్వారా గిరిజన ఉగ్రవాదులు భారత్‌లోకి ప్రవేశిస్తున్నారని.. మత్తు పదార్థాలు కూడా దొంగ రవాణా అవుతున్నాయని మైతీలు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో సరిహద్దుల్లో కంచె నిర్మించాలని చాలా కాలంగా వారు డిమాండ్ చేస్తున్నారు. అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్‌లోనూ అవసరమైన చోట కంచె నిర్మిస్తున్నట్టు షా వెల్లడించారు.

టీచింగ్ పోస్టుల్లో ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం

పార్లమెంటరీ స్థాయి సంఘం ధ్వజం

న్యూఢిల్లీ: విద్యా సంస్థల టీచింగ్ పోస్టుల్లో ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరుగుతున్నదని పార్లమెంటరీ స్థాయి సంఘం ఆవేదన వ్యక్తం చేసింది. ఎంపిక ప్యానెళ్లు పక్షపాతంతో వారిని అనర్హులుగా ప్రకటిస్తున్నాయని తెలిపింది. 'ఎస్సీ, ఎస్టీల సామాజిక-ఆర్థికాభివృద్ధిలో సెంట్రల్ వర్సిటీలు, ఇంజినీరింగ్ కాలేజీలు, ఐఐఎమ్‌లు, ఐఐటీలు, వైద్య సంస్థలు, నవోదయ, సెంట్రల్ స్కూళ్లతో కూడిన స్వయం ప్రతిపత్తి సంస్థలు, విద్యా సంస్థల పాత్ర' అంశంపై కమిటీ మంగళవారం పార్లమెంట్‌కు నివేదిక సమర్పించింది.

డీఎంకే, బీజేపీ మాటల యుద్ధం

న్యూఢిల్లీ: డీఎంకే ఎంపీ టీఆర్ బాలు సోమవారం లోక్‌సభలో కేంద్ర మంత్రి ఎల్ మురుగన్‌పై చేసిన వ్యాఖ్యలపై డీఎంకే, బీజేపీ మధ్య మాటల యుద్ధం మొదలైంది. ఒక దళితుడిని అవమానించారని, అందుకు క్షమాపణ చెప్పాలని బీజేపీ డిమాండ్ చేసింది. తమిళనాడుకే చెందిన మంత్రి మురుగన్ స్వరాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా మాట్లాడటంతో డీఎంకే ఎంపీ టీఆర్ బాలు అతనిని ద్రోహి అన్నారు. లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో తమిళనాడు వరద సాయంపై ఇరుపక్షాల మధ్య వాగ్వాదం మొదలై.. సభ బయట కూడా కొనసాగింది.

పీఎం కిసాన్ పెంచే యోచన లేదు: కేంద్రం

న్యూఢిల్లీ: పీఎం-కిసాన్ పథకం కింద ఏటా రైతులకు ఆర్థిక సాయం కింద ఇస్తున్న రూ.6 వేల మొత్తాన్ని పెంచే ఉద్దేశం లేదని కేంద్రం ప్రకటించింది. లోక్‌సభలో సభ్యుడు అడిగిన ఓ ప్రశ్నకు కేంద్ర మంత్రి అర్జున్ ముండా ఈమేరకు సమాధానమిచ్చారు. ఎన్నికల ఏడాది నేపథ్యంలో పీఎం-కిసాన్ మొత్తాన్ని రూ.8,000 నుంచి రూ.12,000 వరకు కేంద్రం పెంచనున్నట్టు ప్రచారం జరిగింది. అయితే అలాంటి ప్రకటనేదీ లేకుండానే మంగళవారం పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తన ప్రసంగాన్ని ముగించారు.

సహజీవనాన్ని దాస్తే ఆర్నెల్ల జైలు!

బహుభార్యత్వంపై పూర్తి నిషేధం

మత ఆచారాల ప్రకారం పెండ్లికి అనుమతి

వివాహం, విడాకులు, భూమి, ఆస్తి, వారసత్వం అంశాలకు ఒకే చట్టం

ఉత్తరాఖండ్ అసెంబ్లీ ముందుకు ఉమ్మడి పౌరస్మృతి బిల్లు

డెహ్రాడున్, ఫిబ్రవరి 6: ఒకే దేశం, ఒకే ఓటు, ఒకే చట్టం అంటూ ఎంతో కాలంగా నినదిస్తున్న బీజేపీ, సంఘ్ పరివార్ నేతలు ఎట్టకేలకు తమ పార్టీ అధికారంలో ఉన్న ఉత్తరాఖండ్‌లో ఉమ్మడి పౌర స్మృతి బిల్లు (యూసీసీ)ని అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. దేశంలో ఇటువంటి బిల్లును ప్రవేశపెట్టిన మొట్టమొదటి రాష్ట్రంగా ఉత్తరాఖండ్ నిలువనుంది. కీలకమైన లోక్‌సభ ఎన్నికల ముందు ప్రవేశపెట్టిన ఈ బిల్లు ఆమోదం పొందితే.. బీజేపీ నేతృత్వంలోని అస్సాం, గుజరాత్ వంటి ఇతర రాష్ట్రాలు కూడా ఇదే మార్గాన్ని అనుసరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఈ బిల్లు నుంచి గిరిజనులకు మినహాయింపునిచ్చింది. రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామీ మంగళవారం ప్రవేశపెట్టిన ఈ బిల్లులో పౌరులందరికీ వారి మతాలతో నిమిత్తం లేకుండా.. వివాహం, విడాకులు, భూమి, ఆస్తి, వారసత్వం అంశాలలో ఒకే చట్టాన్ని వర్తింపజేయాలని పేర్కొన్నారు. ముఖ్యంగా సహజీవనం చేసే జంటలు తప్పనిసరిగా ఆ విషయాన్ని అధికారుల వద్ద రిజిస్టర్ చేసుకోవాలని స్పష్టం చేశారు. సహజీవనం వల్ల పుట్టిన పిల్లలు చట్టబద్ధమైన వారసులుగా ఉంటారని, భాగస్వామి నుంచి విడిపోయిన మహిళకు భరణం పొందే హక్కు ఉంటుందని తెలిపారు. బహుభార్యత్వాన్ని నిషేధిస్తున్న బిల్లు.. ఆయా మతాలవారిని తమ ఆచారాల ప్రకారం వివాహాలు చేసుకొనేందుకు అనుమతించింది. ఈ బిల్లును మంగళవారం రోజే ఆమోదించాలని భావించినప్పటికీ ప్రతిపక్ష సభ్యులు అభ్యంతరం తెలపడంతో స్పీకర్ వాయిదా వేశారు. ఈ బిల్లును అధ్యయనం చేయాల్సి ఉన్నదని, ఆ తరువాత తమ అభిప్రాయాలు తెలుపుతామని, అంతవరకు వాయిదా వేయాలని ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఆందోళనకు దిగడంతో స్పీకర్ అందుకు అనుమతించారు. ఈ బిల్లు ఉత్తరాఖండ్‌లో నివసిస్తున్న వారికి, రాష్ట్రం వెలుపలనున్న రాష్ట్ర వాసులకు కూడా వర్తిస్తుందని పేర్కొన్నారు.

ఉత్తరాఖండ్ అసెంబ్లీలో ఉమ్మడి పౌరస్మృతి బిల్లు ప్రవేశపెడుతున్న సీఎం పుష్కర్‌సింగ్

సహజీవనాన్ని రిజిస్టర్ చేయాలి

ఉత్తరాఖండ్ ఉమ్మడి పౌర స్మృతి బిల్లు సహజీవనానికి ఆమోదం తెలుపుతూనే జంటల పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నది. సహజీవనం చేస్తున్న, చేయాలని భావిస్తున్న వ్యక్తులు ముందుగా తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవాలని, చట్టాన్ని అతిక్రమించే వారికి ఆరు నెలల జైలు, రూ.25వేల వరకు జరిమానా విధిస్తామని బిల్లులో స్పష్టం చేశారు. ఇక 21 ఏండ్లలోపున్న వ్యక్తులు సహజీవనం చేయాలనుకుంటే ఆ విషయాన్ని వారి తల్లిదండ్రులకు తెలిపే వెసులుబాటును రిజిస్ట్రార్‌కు కల్పించారు. తమ పేర్లను నమోదు చేసుకోకుండా నెల రోజులకుపైగా సహజీవనంలో ఉంటే.. వారికి మూడు నెలల జైలు లేదా రూ.10వేల జరిమానా లేదా ఈ రెండు శిక్షలూ విధిస్తారు. సహజీవనం విషయాన్ని దాచినా లేదా తప్పుడు సమాచారమిచ్చినా.. వారికి కూడా మూడు నెలల జైలు, రూ.25 వేల జరిమానా లేదా ఈ రెండు శిక్షలూ విధిస్తారు. సహజీవనంలో విడిపోవాలన్నా రిజిస్ట్రార్‌కు తెలపాలి.

కేజ్రీవాల్ పీఏ నివాసంలో ఈడీ సోదాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: ఢిల్లీలోని కేజ్రీవాల్ ప్రభుత్వంపై సీబీఐ, ఈడీ దాడుల పరంపర కొనసాగుతూనే ఉన్నది. తాజాగా ఢిల్లీ జల్ బోర్డులో అవినీతి జరిగిందన్న ఆరోపణలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు సోదాలు జరిపారు. సీబీఐ నమోదు చేసిన కేసు ఆధారంగా మనీల్యాండరింగ్ కేసు నమోదు చేసిన ఈడీ.. కేజ్రీవాల్ పీఏ బిభవ్ కుమార్, ఆప్ ఎంపీ ఎన్‌డీ గుప్తా మరికొందరి ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు చేపట్టింది. ఢిల్లీ జల్ బోర్డులో ఓ టెండర్‌కు సంబంధించి అవినీతి చోటుచేసుకున్నదని, ఈ అవినీతి సొమ్ము ఆమ్ ఆద్మీ పార్టీకి ఎన్నికల ఫండ్‌గా వెళ్లిందన్నది ప్రధాన ఆరోపణ. అర్హతలేని కంపెనీకి టెండర్‌ను అప్పగించడానికి డబ్బులు చేతులు మారాయని, ఇలా అవినీతి వల్ల వచ్చిన డబ్బుల్లో దాదాపు రూ.17 కోట్లు ఆప్‌కు అందాయని ఈడీ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ కేసులో ఇప్పటికే ఇద్దరిని అరెస్టు చేసిన అధికారులు తాజాగా ఢిల్లీలో 12 చోట్ల సోదాలు చేపట్టారు. దీనిపై ఢిల్లీ మంత్రి అతిశీ స్పందిస్తూ ఆప్‌ను భయపెట్టడానికే సోదాలు చేపట్టారని విమర్శించారు.

ఆడియో రికార్డులను ఈడీ తొలగించింది!

- ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌పై ఆప్ నేత అతిశీ ఆరోపణ
- మద్యం పాలసీ కేసు దర్యాప్తు ఓ 'స్కామ్' అని వ్యాఖ్య

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: ఢిల్లీలో ఆప్ వర్సెస్ ఈడీ అనేలా పరిణామాలు చోటు చేసుకొంటున్నాయి. తాజాగా మద్యం పాలసీ కేసుపై దర్యాప్తునకు సంబంధించి ఈడీపై ఆప్ సీనియర్ నేత, ఢిల్లీ మంత్రి అతిశీ తీవ్ర ఆరోపణలు చేశారు. ఢిల్లీలో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ మద్యం పాలసీ కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై ఈడీ చేస్తున్న మొత్తం దర్యాప్తును ఒక 'స్కామ్'గా వర్ణించారు. నిందితులు, సాక్షుల సీసీటీవీ విచారణ, వాంగ్మూలాలకు సంబంధించిన ఆడియో రికార్డింగ్‌లను దర్యాప్తు సంస్థ తొలగించిందని ఆరోపించారు. ఆడియో ఫైల్స్‌ను తొలగించడం ద్వారా ఈడీ ఎవరికి కాపాడాలనుకొంటున్నదని, ఏం దాచాలనుకొంటున్నదని ప్రశ్నించారు.

ఆతిశీపై ఈడీ చట్టపరమైన చర్యలు!

అయితే ఆప్ నేత అతిశీ ఆరోపణలను ఈడీ వర్గాలు కొట్టిపారేశాయి. అతిశీ వ్యాఖ్యలపై చట్టపరమైన చర్యలు తీసుకొనే అంశాన్ని పరిశీలిస్తున్నట్టు వెల్లడించాయి. విచారణ సమయంలో ఫుటేజ్ కేవలం వీడియో ఫార్మాట్‌లో మాత్రమే రికార్డు అవుతుందని, ఆ సమయంలో సీసీటీవీ వ్యవస్థలో ఆడియో రికార్డింగ్ వ్యవస్థ ఉండదని పేర్కొన్నాయి.

బతుకులు బుగ్గి

బాణసంచా పరిశ్రమలో భారీ పేలుడు..

11 మంది మృతి.. 174 మందికి గాయాలు

మధ్యప్రదేశ్‌లోని హర్దాలో దుర్ఘటన

హర్దా, భోపాల్, ఫిబ్రవరి 6: మధ్యప్రదేశ్‌లో మంగళవారం ఘోర ప్రమాదం సంభవించింది. బాణసంచా పరిశ్రమలో పేలుడు సంభవించడంతో 11 మంది దుర్మరణం చెందారు.174 మంది గాయపడ్డారు. ఈ ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియలేదు. ఒక అనుమానితుడిని పోలీసులు అదుపులోనికి తీసుకొన్నారు. అధికారుల కథనం ప్రకారం హర్దా పట్టణ శివార్లలో ఉండే ఫ్యాక్టరీలో ఈ ప్రమాదం సంభవించింది. గాయపడిన వారిని వివిధ దవాఖానలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. 'మంటలను ఆర్పివేశాం. శిథిలాలను తొలగించాం. దర్యాప్తు కొనసాగుతున్నది. కానీ ప్రస్తుతం సహాయక చర్యలకే మా ప్రాధాన్యం' అని నర్మదాపురం కమిషనర్ పవన్ శర్మ మీడియాకు తెలిపారు. ప్రమాద తీవ్రత, బాధితులు భద్రత కోసం పరుగులు పెడుతున్న వీడియోలు సోషల్ మీడియాలో సర్క్యులేట్ అయ్యాయి.

హర్దాలోని బాణసంచా ఫ్యాక్టరీలో పేలుడుతో ఎగిసిపడుతున్న మంటలు

వివాహ వ్యవస్థను కాపాడుకోవాలి

- *సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్య*
- *సరగసీ ద్వారా తల్లి కావాలని ఒంటరి మహిళ పిటిషన్*
- *తిరస్కరించిన సుప్రీంకోర్టు*

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: భారతీయ సమాజంలో వివాహ వ్యవస్థను రక్షించాల్సిన అవసరముందని సుప్రీం కోర్టు నొక్కిచెప్పింది. సరగసీ ద్వారా బిడ్డను కనేందుకు 44 ఏండ్ల అవివాహిత దాఖలుచేసిన పిటిషన్‌ను తిరస్కరిస్తూ మంగళవారం జస్టిస్ నాగరత్న, జస్టిస్ అగస్టిన్ జార్జ్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం ఈ కామెంట్ చేసింది. విదేశాల్లోలాగా వివాహం కాకుండానే తల్లులు కావటం భారతీయ వివాహ వ్యవస్థకు విరుద్ధమని వ్యాఖ్యానించింది. సరగసీ రెగ్యులేషన్ చట్టం ప్రకారం వితంతువులు, లేదా విడాకులు తీసుకున్న 35 నుంచి 45 ఏండ్ల మధ్య వయసున్న మహిళలు మాత్రమే సరగసి పద్ధతి ద్వారా పిల్లల్ని పొందవచ్చు. అంతేకానీ.. పెళ్లి కాని ఒంటరి మహిళలు సరగసి ద్వారా తల్లి కావటానికి వీలు లేదు. భారతీయ సమాజంలో తల్లి కావాలంటే వివాహ వ్యవస్థ ద్వారానే కావాలి అనేది ఆచారం. వివాహంతో సంబంధం లేకుండా పిల్లలని కనటం అనాచారమని.. తాము దీని గురించే ఆందోళన చెందుతున్నామని ధర్మాసనం పేర్కొంది. తాము పిల్లల సంక్షేమం దృష్టిలో పెట్టుకునే ఈ వ్యాఖ్యలు చేస్తున్నామని కూడా వివరించింది. 'మన దేశంలో వివాహ వ్యవస్థను సంరక్షించాల్సిన బాధ్యత మనపై ఉన్నది.. ఇలా తీర్పు చెప్తున్నందుకు మమ్మల్ని మీరు సంప్రదాయ వాదులని నిందించినా పర్వాలేదు' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఓ బహుళజాతి సంస్థలో పనిచేసే 44 ఏండ్ల అవివాహిత సరోగసి (నియంత్రణ) చట్టంలోని సెక్షన్ 2 చెల్లుబాటును సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేసింది. దీన్ని విచారించిన సుప్రీం ధర్మాసనం పై విధంగా వ్యాఖ్యానించింది. విదేశాల్లో చాలా మంది పిల్లలకు వారి తల్లిదండ్రులెవరో తెలీదని.. అలాంటి దుస్థితి మన పిల్లలకు రాకూడదని తాము అభిప్రాయపడుతున్నామని ధర్మాసనం తెలిపింది. ఈ రోజుల్లో సైన్స్ అభివృద్ధి చెందింది. కానీ, సామాజిక నిబంధనలు కాదని సుప్రీం పేర్కొనటం గమనార్హం.

రోడ్డు పక్కనున్న ప్రతి రాయి విగ్రహం కాదు!

మద్రాస్ హైకోర్టు

చెన్నై: రోడ్డుపక్కన ఉన్న ప్రతీ రాయి విగ్రహం కాదు. ఈ కాలంలోనూ సమాజంలో మూఢ నమ్మకాలు ఉండటం విచారకరం.. అంటూ ఓ కేసు విచారణ సందర్భంగా మద్రాస్ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. తన స్థలానికి ఎదురుగా రాయిని పెట్టి.. విగ్రహంగా పూజిస్తున్నారని, రాయిని తొలగించబోతే తనను అడ్డుకున్నారని కోర్టులో ఓ వ్యక్తి పిటిషన్ దాఖలు చేశాడు. దీనిపై హైకోర్టు పై విధంగా తీర్పు ఇచ్చింది. వారంలోగా ఆ రాయిని అక్కడ్నుంచి తొలగించాలని పల్లవరం రేంజ్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్‌కు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. 'దేశంలో మూఢ నమ్మకాలు ఇప్పటికీ ఉన్నాయి. కాలానుగుణంగా సమాజంలో, ప్రజల్లో మార్పు రాకపోవటం దురదృష్టకరం' అని న్యాయమూర్తి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.